క్లుప్తంగా

ఇందిరమ్మ లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక

బయ్యారం/గార్ల/నర్సింహులపేట/గూడూరు/మరిపెడ రూరల్/డోర్నకల్/కేసముద్రం/తొర్రూరు: మండలంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఉచితంగా ఇసుకను రవాణా చేసుకునేందుకు కూపన్లు ఇవ్వనున్నట్లు తహసీల్దార్లు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. లబ్ధిదారులు పంచాయతీ కార్యదర్శి, హౌసింగ్ ఏఈ ద్వారా లెటర్ తీసుకొని కార్యాలయంలో ఇస్తే కూపన్లు మంజూరు చేస్తామన్నారు. మంజూరు అయిన కూపన్ల ద్వారా జిల్లా అధికారులు కేటాయించిన ర్యాంపు నుంచి లబ్ధిదారులు ఇసుకను రవాణా చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు నాగరాజు, శారద, రమేశ్‌బాబు, నాగభవాని, కృష్ణవేణి, ఇమ్మానియల్, వివేక్, శ్రీనివాస్, సీఐ రాజేశ్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికలు

కురవి: 2025–26 విద్యా సంవత్సరానికి 4వ తరగతిలో స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి విద్యార్థుల ఎంపికలు ఈనెల 19న కురవి జెడ్పీ హైస్కూల్‌లో సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ వి.బాలాజీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్టిఫికెట్లతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. 2016 మే 1వ తేదీ, 2017 ఆగస్టు 31వ తేదీ మధ్య జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఎంపిక పోటీలకు హాజరు కావాలని సూచించారు.

శ్రీనివాస్‌కు సేవా పురస్కారం

పెద్దవంగర: మండల కేంద్రానికి చెందిన సిరి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు ఏదునూరి శ్రీనివాస్ రాష్ట్రస్థాయి ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని హబ్సిగూడలోని ఐఐసీటీలో తాజాగా నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు నుంచి పురస్కారం అందుకున్నారు. కాలుష్యం, వ్యర్థాల నిర్వహణ, క్రిమి సంహారక మందుల వాడకంతో తలెత్తే అనర్థాలపై శ్రీనివాస్ రైతులకు అవగాహన కల్పిస్తున్నాడు. ఈనేపథ్యంలో ఆయనకు ఈ పురస్కారం దక్కింది.

నిధుల కేటాయింపుపై హర్షం

మహబూబాబాద్ రూరల్: మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.50 కోట్లు కేటాయించిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మురళీనాయక్ ఫ్లెక్సీకి శుక్రవారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాలాభిషేకం చేసి, మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో నాయకులు ఖలీల్, ఎడ్ల రమేష్, రాజుగౌడ్, గిరిధర్ గుప్తా, నరసింహారావు, సురేష్, ఫెరోజ్, ఫయాజ్, పద్మ, లక్ష్మి, శ్రీనివాస్, వీరన్న, కమలాకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

నెల్లికుదురు: ప్రభుత్వ కళాశాలల్లోనే అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్య అందుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అరిగకూటి శ్రీనివాసరెడ్డి, ఇంటర్ బోర్డు డిప్యూటీ సెక్రెటరీ ఖాదిర్ షరీఫ్ అన్నారు. స్థానిక కళాశాలలో శుక్రవారం జేఈఈ అడ్వాన్స్‌లో ప్రతిభ కనబర్చిన బానోతు సోమన్న, డైట్‌సెట్‌లో ప్రతిభ కనబర్చిన పరమేశ్వరిని అధ్యాపక బృందంతో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీను, కవి రాజు, రఘురాం, నాగేశ్వరరావు, శ్రీనివాస్, సుధాకర్, మహేందర్, రాంమ్మూర్తి, బాబు పాల్గొన్నారు.

వైద్యాధికారిపై బదిలీ వేటు

సాక్షి ఎఫెక్ట్..

దంతాలపల్లి: నర్సింహులపేట, దంతాలపల్లి ఉమ్మడి మండలాలలో ఉన్న 10 ఆరోగ్య ఉపకేంద్రాలకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 'ఆయూష్మాన్ నిధులు ఎక్కడ' అనే శీర్షిక గత నెల 27న 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన విషయం విధితమే. కాగా మండల కేంద్రంలోని వైద్యశాలను జిల్లా వైద్యశాఖ అధికారి రవిరాథోడ్ తనిఖీ చేశారు. కాగా నిధుల విషయంలో సదరు వైద్యాధికారిపై బదిలీ వేటు వేసినట్లు సమాచారం.

శుభ్రత ఎక్కడ?



పాఠశాల ఆవరణలో ఉన్న చెత్త ట్రాక్టర్

బయ్యారం: పల్లెల్లో పరిసరాల పరిశుభ్రత చెప్పుకోవటానికే తప్ప ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదనటానికి ఈ చిత్రం నిలువెత్తు సాక్ష్యం. మండలంలోని బాల్యాతండా పంచాయతీ, పాఠశాల ఆవరణంలో ఉన్న ట్రాక్టర్‌ను నాలుగు రోజులుగా బయటకు తీయడం లేదు. దీంతో తండావాసులు చెత్తను తీసుకొచ్చి ట్రాక్టర్‌పై వేస్తుండటంతో ఇలా పాఠశాల, పంచాయతీ ఆవరణం అపరిశుభ్రంగా కనపడుతుంది. ఇప్పటికైనా ట్రాక్టర్‌లో ఉన్న చెత్తను డంప్‌కు తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

అసంపూర్తిగా అంబేడ్కర్ భవనం

● రూ.10లక్షలు ఉంటే వినియోగంలోకి..



అసంపూర్తిగా ఉన్న అంబేడ్కర్ భవనం

కురవి: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఎస్సీ కాలనీకి వెళ్లే మార్గంలో కొన్నేళ్ల క్రితం నిర్మించిన అంబేడ్కర్ భవనం అసంపూర్తిగా మిగిలిపోయింది. 15ఏళ్ల క్రితం కాలనీలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి అడుగులు పడ్డాయి. ప్రభుత్వం సుమారు రూ.10లక్షలతో అంబేడ్కర్ భవనాన్ని నిర్మించారు. అయితే ఆ నిధులు సరిపోకపోవడంతో భవన నిర్మాణం పూర్తి కాకుండానే అసంపూర్తిగా మిగిలిపోతుంది. దీంతో పనులు నిర్వహించిన సదరు కాంట్రాక్టర్ నిధులు లేకపోవడంతో పనులు నిలిపివేశాడు. అప్పటి నుంచి నేటి వరకు అంబేడ్కర్ భవనాన్ని పూర్తి చేయాలని దళిత సంఘాల నాయకులు, అంబేడ్కరిస్టులు అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొర పెట్టుకున్నారు. గతంలో మహబూబాబాద్ కలెక్టర్‌గా పనిచేసిన గౌతమ్ అంబేడ్కర్ భవనాన్ని పరిశీలించి నిధులు కేటాయించేందుకు ఉత్తర్వులు సైతం ఇచ్చారు. అయితే ఆయన బదిలీపై వెళ్లడంతో ఎవరు పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో దానికి నిధులు ఇచ్చే అవకాశం లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించి అంబేడ్కర్ భవనాన్ని పూర్తి చేసేందుకు రూ.10లక్షలు మంజూరు చేస్తే అంబేడ్కర్ భవనం ఉపయోగంలోకి వస్తుంది. లేని పక్షంలో భవనం శిథిలమై పోవడం ఖాయం.

నిధులు కేటాయించి పూర్తి చేయాలి



మండల కేంద్రంలో అంబేడ్కర్ భవనాన్ని పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలి. నిధులు కేటాయిస్తే భవన నిర్మాణం పూర్తి అయి అందరికీ ఉపయోగపడుతుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు నిధులు ఇచ్చేలా సహకరించాలి.

– దైద భద్రయ్య, దళితరత్న అవార్డు గ్రహీత, కురవి

సాగులో ఉన్న రైతులకు పట్టాలు ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

మహబూబాబాద్: 116, 119 సర్వే నంబర్ల ప్రభుత్వ భూమిలో 70ఏళ్లుగా సేద్యం చేసుకుంటున్న రైతులకు వెంటనే పట్టాలు ఇవ్వాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జి.ఐలయ్య డిమాండ్ చేశాడు. ఎన్డీ ఆధ్వర్యంలో గార్ల మండలం మద్దివంచ రెవెన్యూ పరిధిలోని రైతులు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. ఈసందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ.. గార్ల మండలం, మద్దివంచ రెవెన్యూ పరిధిలో 116, 119 సర్వే నంబర్‌లలో 900ఎకరాల ప్రభుత్వంలో గిరిజన, గిరిజనేతరులు సాగు చేస్తున్నారన్నారు. పట్టాలు లేకపోవడంతో రైతుబంధు, రైతుభరోసా లాంటి పథకాలు వర్తించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి మద్దివంచ రైతులకు న్యాయం చేయకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గుగులోత్ సక్రు, శ్రీధర్, మధు, బాబూరావు, భద్రయ్య, రంగారావు, మల్లేష్, బాషింగ్, అప్పయ్య, మంగయ్య పాల్గొన్నారు.

రుణాలు మంజూరు చేయాలి

తొర్రూరు: గొర్రెల ఫామ్‌లు పెట్టుకునేందుకు గొల్ల కురుమలకు ప్రభుత్వం రుణాలు మంజూరు చేయాలని జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి బొల్లం అశోక్ అన్నారు. డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో శుక్రవారం జీఎంపీఎస్ మండల మహాసభ నిర్వహించారు. ఈనెల 22న మహబూబాబాద్‌లో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలన్నారు. మండల అధ్యక్షుడిగా ఎద్దు ఐలయ్య, కార్యదర్శిగా మద్దెల రాజు ఎన్నుకున్నారు.

నూతన దిమ్మెలను ఏర్పాటు చేసుకోవాలి

కేసముద్రం: వచ్చే జులై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ నూతన దిమ్మెలను ఏర్పాటు చేసుకుని, జెండాలను ఆవిష్కరించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు శాగంటి రమేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, సాయిబాబా, యుగేందర్, రవి, రవీందర్ పాల్గొన్నారు.

గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం

● ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు రూరల్: నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చెర్లపాలెం, గోపాలగిరి, పత్తేపురం గ్రామాలకు మంజూరైనా రూ. 27లక్షల సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతు భరోసా, వరి ధాన్యానికి బోనస్, ఉచిత బస్ ప్రయాణం, ఉచిత కరెంట్, సబ్సిడిపై గ్యాస్, మహిళ సంఘాల రుణాలు వంటి సంక్షేమ పథకాలను నిరుపేద ప్రజలకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు..

పేదల సొంతింటి కల సాకారం

తొర్రూరు: ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కల సాకారమవుతుందని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో శుక్రవారం మండలంలోని 136 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పుల్లారావు, మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, నాయకులు శ్రీనివాస్, రాజశేఖర్, కుమార్, అశోక్‌రెడ్డి, రామలింగం పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

గూడూరు: మండలంలోని గుండెంగ శివారు నల్లబోడుతండాకు చెందిన బానోతు ఐశ్వర్య పురుటి నొప్పులతో బాధపడుతుంది. గురువారం రాత్రి కుటుంబ సభ్యులు 108లో గూడూరు ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువయ్యాయి. అప్రమత్తమైన అంబులెన్స్ ఎమర్జెన్సీ టెక్నీషియన్ బక్కి లలిత సాధారణ ప్రసవం చేసింది. ఐశ్వర్య బాబుకు జన్మనిచ్చింది.

'మంత్రుల కుట్రతో ఎడారిగా బయ్యారం'



ఆందోళన నిర్వహిస్తున్న నాయకులు

బయ్యారం: ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రుల కుట్రలతో బయ్యారం, గార్ల మండలాలు ఎడారిగా మారుతున్నాయని వామపక్ష పార్టీల నాయకులు ఆరోపించారు. బయ్యారం పెద్దచెరువుకు గోదావరి జలాలు తీసుకురావాలని, కాల్వలకు మరమ్మతులు చేయాలని శుక్రవారం బయ్యారం వీధుల్లో న్యూడెమోక్రసీ, సీపీఎం, మాస్‌లైన్, సీపీఐల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం బస్టాండ్ సెంటర్‌లో ఆందోళన నిర్వహించారు. ఇప్పటికైనా బయ్యారం పెద్దచెరువుకు గోదావరి జలాలు తీసుకరావడంతోపాటు కాల్వలకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని లేని ఎడల దశలవారీగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ ఆందోళనలోనాయకులు భిక్షం, మధు, వీరభద్రం, రాకేష్, మురళీ, వెంకన్న, నాగేశ్వరరావు, యాకయ్య, లచ్చయ్య, మంగీలాల్ పాల్గొన్నారు.

25 క్వింటాళ్ల నల్లబెల్లం స్వాధీనం



పట్టుకున్న బెల్లం ట్రాలీతో పోలీసులు

నెల్లికుదురు: అక్రమంగా తరలిస్తున్న నల్లంబెల్లం, పటిక వాహనాన్ని పట్టుకుని సీజ్ చేసి ఐదుగురిపై కేసు నమోదు చేశారు. ఈ సంఘటన మండల కేంద్రంలోని క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేద్రంలోని క్రాస్ రోడ్డు వద్ద పోలీసు సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానాస్పందంగా ఉన్న ట్రాలీ ఆటోను ఆపి పరిశీలించగా రూ.2.5లక్షల విలువ చేసే 45బస్తాల నల్లబెల్లం, 5బస్తాల పటిక బెల్లం మొత్తం 25క్వింటాళ్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. నల్లబెల్లం తరలిస్తున్న బాబునాయక్ తండాకు చెదిన భూక్య అరుణ్, వేమునూరు తండాకు చెందిన బాదావత్ సుమన్, వేమునూరు రాయుకుంట తండాకు చెందిన బానోతు గణపతి, మహబూబాబాద్ మండలం వీరారం తండాకు చెందిన బానోతు రవీందర్, కార్తీక్‌లు గుర్తించి కేసు నమోదు చేసి నల్లబెల్లం, పటిక బెల్లంతో పాటు ట్రాలీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రవీందర్, కార్తీక్ పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

సాగుపై రైతులకు అవగాహన



మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త మాలతి


నర్సింహులపేట: రైతులు నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి, అధిక దిగుబడులు పొందాలని కృషి విజ్ఞాన కేంద్రం మల్యాల శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.మాలతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వరి పంటకు వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అధిక సాంద్రత విధానంలో పత్తి పంట వేసే విధానంపై వివరించారు. అనంతరం ఆయిల్ పామ్, కూరగాయల సాగుపై దృష్టి పెట్టాలని ఉద్యానవనశాఖ అధికారి మానస తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి వినయ్‌కుమార్, క్రాంతికుమార్, కిశోర్‌కుమార్, ఏఈఓలు శరత్‌చంద్ర, కల్యాణి, రైతులు ప్రభాకర్‌రెడ్డి, నవీన్‌కుమార్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి కృషి

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ బడులు, జూనియర్ కళాశాలల్లో అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలుర ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా వివిధ నూతన భవన సముదాయాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మార్నేని వెంకన్న, బీఆర్ఎస్ నాయకులు వెంకన్న, జనార్దన్, వెంకన్న, రఘు, వేణు, కన్నా, అంబరీష పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



పెద్దవంగర: నకిలీ విత్తనాలను విక్రయించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ గుగులోతు స్వామినాయక్ తెలిపారు. మండలంలోని పోచంపల్లి, పెద్దవంగర, అవుతాపురం గ్రామాల్లోని ఎరువులు, విత్తనాల దుకాణాల్లో శుక్రవారం మండల వ్యవసాయాధికారి తనిఖీ చేపట్టారు.

విత్తనషాపుల్లో తనిఖీలు

బయ్యారం: మండలంలోని గంధంపల్లి–కొత్తపేటలోని పలు విత్తన, ఎరువుల షాపుల్లో శుక్రవారం ఏఓ రాంజీ, ఎస్సై తిరుపతి పలు షాపుల్లో తనిఖీలు నిర్వహించి రిజిస్టర్లను, విత్తనప్యాకెట్లను పరిశీలించారు.

నేడు డిప్యూటీ స్పీకర్ పర్యటన

మరిపెడ రూరల్: నేడు శనివారం మరిపెడ మండలంలో ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ డాక్టర్ జాటోతు రామచంద్రునాయక్ పర్యటించనున్నారు. ఇందిరమ్మ పథకం కింద ఎంపికైన ముగ్గురు లబ్ధిదారులకు ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేయనున్నారు.

సీపీఐ మండల కార్యదర్శిగా శ్రీనివాస్

బయ్యారం: సీపీఐ మండల కార్యదర్శిగా సారిక శ్రీనివాస్ మూడోసారి ఎన్నికయ్యాడు. మండలంలోని సంతులాల్‌పోడుతండాలో జరిగిన మహాసభల్లో ఎన్నుకున్నారు.

ప్రైవేటీకరణ ప్రమాదకరం

నెల్లికుదురు: ప్రైవేటీకరణ అత్యంత ప్రమాదకరమని, ప్రైవేటు సంస్థలు జవాబుదారీగా ఉండరని, ప్రజల ప్రాణాలకు ప్రభుత్వాల నిర్లక్ష్యం చేస్తున్నారని పేదల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిరగాని భిక్షపతి గౌడ్ పిలుపునిచ్చాడు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి శ్రద్ధాంజలి ఘటించారు. ప్రభుత్వ ఆదీనంలోనే సంస్థలు పని చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మాజీ మంత్రి సత్యవతికి పరామర్శ..

మరిపెడ రూరల్: ఇటీవల మోకాలి శస్త్ర చికిత్స చేయించుకున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌ను డిప్యూటీ స్పీకర్ డాక్టర్ జాటోతు రామచంద్రునాయక్ హైదరాబాద్ సోమాజిగూడలోని ఆమె నివాసంలో శుక్రవారం కలిసి పరామర్శించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తొర్రూరు: మండలంలోని ఖానాపురం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏఈ జయప్రకాష్ నారాయణ తెలిపారు. సబ్‌స్టేషన్‌లోని అమ్మాపురం, గుర్తూరు, ఖానాపురం, సోమారం గ్రామాల్లో శనివారం (నేడు) ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందన్నారు.

గూడూరులో..

గూడూరు: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలలో నేడు శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ప్రణీత్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని వినతి

కేసముద్రం: రాష్ట్రంలోని కార్మికశాఖ కార్యాలయాలలో ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేయాలంటూ శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర సంయుక్త లేబర్ కమిషనర్ చంద్రశేఖర్‌కు ఏఐసీటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందించినట్లు, సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కంచ వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు.

మండల కమిటీ ఎన్నిక

కురవి: టీడీపీ మండల కమిటీ ఎన్నిక శుక్రవారం మండల కేంద్రంలో జరిగింది. పార్టీ పార్లమెంటు కన్వీనర్ కొండపల్లి రాంచందర్‌రావు కమిటీని ప్రకటించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా పేరం వీరస్వామి, నామా పద్మాకర్‌లను ఎన్నుకున్నారు.

ఫీజుల నియంత్రణ చట్టం చేయాలి

కురవి: ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా నాయకుడు మాలోత్ కిషన్ నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుమతి లేని పాఠశాలలపై చర్యసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బానోత్ దేవానాయక్, కిషన్ నాయక్, రాందాస్ నాయక్, మున్నా నాయక్ పాల్గొన్నారు.

ఓపెన్ ప్రవేశాలు ప్రారంభం

నెల్లికుదురు: ఓపెన్ పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు ప్రారంభ మయ్యాయని ఆగస్టు 12వరకు ప్రవేశాలు కొనసాగుతాయని హెచ్ఎం, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ సీహెచ్ జీవన్ కుమార్ తెలిపారు. వివరాలకు 99082 34819, 97015 75227 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కేసముద్రం: మున్సిపాలిటి పరిధిలోని అమీనాపురంలో గల శ్రీభూనీలా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు.

రైతుల ఖాతాల్లో వెంటనే జమచేయాలి

గార్ల: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతుల బ్యాంకు ఖాతాల్లో రైతుబంధు నగదు జమ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో పిచ్చయ్య, భిక్షం, శ్రీను పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి భూమి పూజ

డోర్నకల్: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులంతా వెంటనే ఇంటి నిర్మాణం ప్రారంభించాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కాలా సుమేర్‌చంద్‌జైన్ తెలిపారు. డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో శుక్రవారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల భూమి పూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లావుల హరికృష్ణ, మాదా శ్రీనివాస్, తారాచంద్, ఏపూరి రమణ పాల్గొన్నారు.

నల్లబెల్లం పట్టుకొని వదిలేశారు..!

నర్సింహులపేట: మండలంలోని ఓ గ్రామ పంచాయతీ శివారులో అక్రమంగా కారులో నల్లబెల్లం తరలిస్తుండగా ఇద్దరు అధికారులు పట్టుకుని, చేతివాటం పొంది వదిలేశారని.. శుక్రవారం మండలంలోని సోషల్ మీడియాలో వివిధ వాట్సాప్ గ్రూప్‌ల్లో విస్తృతంగా ప్రచారం జరిగింది. పట్టుకున్న బెల్లం ఎంత?పట్టుకున్నది ఎవరు?కుదిరిన డీల్‌పై ఇంటిలిజెన్స్ అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

గుమ్టీదారులకు న్యాయం చేయాలి

మహబూబాబాద్: గుమ్టీదారులను ఖాళీ చేయించే నిర్ణయాన్ని మున్సిపల్ అధికారులు విరమించుకోవాలని సీపీఐ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశాడు. పార్టీ ఆధ్వర్యంలో చిరువ్యాపారులు శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయంలో టీపీఎస్ ప్రవీణ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పెరుగు కుమార్, రమేష్ పాల్గొన్నారు.

జవాన్‌లకు సన్మానం

చిన్నగూడూరు: చిన్నగూడూరు మండలం జయ్యారం గ్రామానికి చెందిన వీరజవాన్‌లు దేశగాని రవిగౌడ్, పచ్చిపాల ఉమేష్, రొట్టెల మహేష్‌లను శుక్రవారం జయ్యారం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తేజోన్నతరెడ్డి, సంపత్, ఉపేందర్, అర్జున్‌రెడ్డి, సాయి, సతీష్ పాల్గొన్నారు.

చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం



మహబూబాబాద్ అర్బన్: హనుమంతునిగడ్డలో..



డోర్నకల్: అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈఓ



తొర్రూరు రూరల్: చెర్లపాలెం స్కూల్‌లో..



మహబూబాబాద్ రూరల్: అక్షరాభ్యాసం చేయిస్తున్న శ్రీధర్ రెడ్డి, తదితరులు



గూడూరు: అయోధ్యపురం పాఠశాలలో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈఓ



గార్ల: మండలం మంగలితండా అంగన్‌వాడీ కేంద్రంలో..

ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం చిన్నారులకు ఉపాధ్యాయులు, హెచ్ఎంలు, ఎంఈఓలు అక్షరాభ్యాసం చేయించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. అనంతరం పిలల్లకు యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు, పలు స్వచ్ఛంద సంస్థల బాధ్యులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



మయూరి దంపతులను సత్కరిస్తున్న బ్రాహ్మణ ప్రతినిధులు

తొర్రూరు: బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని బోప్పా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్ అన్నారు. వరంగల్ భద్రకాళి దేవస్థాన డైరెక్టర్‌గా నియమితులైన మోత్కూరి మయూరి, రాము దంపతులను శుక్రవారం డివిజన్ కేంద్రంలో బ్రాహ్మణ ప్రతినిధులు సత్కరించారు. సుధాకర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఆయా దేవాలయాల పాలకవర్గాల్లో చైర్మన్, డైరెక్టర్లుగా బ్రాహ్మణ ప్రతినిధులకు అవకాశం కల్పించడం హర్షనీయమన్నారు. బ్రాహ్మణ విద్యార్థుల విదేశీ విద్య కోసం ప్రభుత్వం రూ.43కోట్లు మంజూరు చేయడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగు నవీన్‌శర్మ, ప్రతినిధులు విష్ణుదాసు, సంతోష్, వంశీధర్‌రావు, రాము, లక్ష్మణాచార్యులు, వెంకటాచార్యులు, మోహనశర్మ, రామాచార్యులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో మంచి ఆదాయం



ఆయిల్‌పామ్ మొక్క నాటుతున్న అధికారి

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి గ్రామంలో ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ మేళా నిర్వహించామని ఉద్యాన అధికారి ఎ.జె.శాంతిప్రియదర్శిని శుక్రవారం తెలిపారు. కంబాలపల్లి గ్రామానికి చెందిన కాత్రాల ఉమ 3ఎకరాల వ్యవసాయ భూమిలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించామన్నారు. సాగుతో రైతులు మంచి ఆదాయం వస్తుందని వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ అధికారి శ్రీకాంత్, కుమార్ ఇరిగేషన్ కంపెనీ డీసీఓ అశోక్, ఎఫ్సీఓ నవీన్, మహేంద్ర ఈపీసీ ఇరిగేషన్ కంపెనీ ప్రతినిధి అశోక్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలికకు గాయాలు

గార్ల: బైక్ ఢీకొన్న ఘటనలో బాలిక కాలు ఫ్యాక్చర్ అయిన సంఘటన శుక్రవారం రాత్రి పూమ్యాతండాలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. గార్ల మండలం పూమ్యాతండాకు చెందిన అనూష రోడ్డు దాటుతుండగా గార్ల నుంచి బాలాజీతండాకు వెళ్తున్న బైక్ ఢీకొట్టింది. ఈఘటనలో బాలిక కాలు విరగడంతో, కుటుంబ సభ్యులు స్థానిక సీహెచ్‌సీ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం 108 వాహనంలో మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

విమాన మృతులకు నివాళి

మహబూబాబాద్ అర్బన్: అహ్మదాబాద్ విమాన ప్రమాద మృతులకు కాళోజీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నామిరెడ్డి వెంకటరెడ్డి, పట్టాభి లక్ష్మయ్య, పెద్ది వెంకన్న, మైసా శ్రీనివాస్, హట్యానాయక్, పొక్కుల సదానందం పాల్గొన్నారు.

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎస్.కె. అన్వర్ పాషా, (S.R) : 7997958185
ఐ. సతీష్ (S.R) (డోర్నకల్) : 9640394736
ఎం. మురళి, (S.R) (తొర్రూరు) : 7680822646